"ఆ తర్వాత తన తప్పిదాన్ని గ్రహించిన అర్జునుడు కౌరవులతో యుద్ధం చేసాడు. అంటే మనిషి తన కర్తవ్యాన్ని చక్కగా నెరవేర్చేలా చేస్తుంది తప్ప గీత ఎవర్నీ సన్యాసిని చేయదని దీన్ని బట్టి అర్థం కావడం లేదూ?"

"నిజమే స్వామి." ఒప్పుకుంది.

"అంతే కాదు. అర్జునుడు ఆ తర్వాత సన్యసించాడా? లేదు. హాయిగా కాపురం చేసుకున్నాడు."

ఆ సమాధానానికి ఆమెలోని భయం చేత్తో తీసేసినట్లుగా పోయింది. తన పిల్లల చేత గీతా పారాయణం చేయించసాగింది.

## 75. దుర్మార్గపు అవివేకి

ఓ ఆలయానికి వచ్చే భక్తులకి ప్రసాదం చేసి పెట్టడానికి వీలుగా పెద్ద ఇత్తడి గిన్నెని కొనాలని ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడికి పూజారి సూచించాడు.

"ఊహు. మన దగ్గర ఉన్న కాస్త డబ్బుతో భక్తులు కానుకలు వేయడానికి అనువుగా ఓ హుండీని కొనాలని బోర్డు సభ్యులు నిర్ణయించారు." చెప్పాడు అధ్యక్షుడు.

"రాత్రి స్వామివారు నా కల్లో కనబడి ఆ డబ్బుతో ఇత్తడి గిన్నెనే కొనమని చెప్పారు." అభ్యంతరం చెప్పాడు పూజారి.

"కాని ఆయన నాకా సంగతి చెప్పలేదు కదా? ఎలా నమ్మమంటావది?"

"సరే. నేను దేవుడ్ని ప్రార్థిస్తాను. ఆ సంగతి ఆయన ఏదైనా సూచన ద్వారా తెలియచేయచ్చు. దీన్ని బోర్డు మీటింగ్‌లో ఓటింగ్‌కి పెడదాం." దైవ భక్తుడైన పూజారి సూచించాడు.

ఆ ప్రకారం తొమ్మిదిమంది సభ్యులుగల బోర్డు మీటింగ్ జరుగుతూండగా పూజారి దేవుడ్ని ప్రార్థించసాగాడు. ఆ అంశం ఓటింగ్‌కి పెట్టబోతూండగా ఆకాశంలో అకస్మాత్తుగా నల్లటి దట్టమైన మేఘాలు ఆవరించి వెంటనే జోరున వర్షం కురిసి, పెద్ద మెరుపు మెరిసి కిటికీలోంచి ఓ పిడుగు వచ్చి ఆ గదిలో అధ్యక్షుడి పక్కనే పడింది.

"అది ఇక్కడే ఎందుకు పడింది? దేవుడి సూచనగా మీరు దాన్ని అర్థం చేసుకోవాలని." పూజారి ఆనందంగా అధ్యక్షుడికి చెప్పాడు.

"ప్రకృతి సిద్ధంగా జరిగిన దీన్ని దేవుడి సూచనగా నేను ఒప్పుకోను. మళ్ళీ ఇంకోసారి పిడుగు పడితే అప్పుడు చూద్దాం." నిరాకరించాడు అధ్యక్షుడు.

ఆ పూజారి దృఢ విశ్వాసంతో దేవుడ్ని మళ్ళీ తీవ్రంగా ప్రార్థించాడు. కొద్ది సేపటికి మళ్ళీ పెద్ద మెరుపు మెరసి ఆ గదిలోని టేబిల్ మీద ఇంకో పిడుగు పడటంతో ఆ టేబిల్ కాలిపోయింది. ఆ అదురుకి కుర్చీ ఎగిరి గాల్లోకి లేచి పడింది. దాంట్లోంచి కింద పడ్డ అధ్యక్షుడిని సభ్యులంతా కలిసి లేవతీసారు.

"ఇప్పుడేమంటారు?" ప్రశ్నించాడు పూజారి నవ్వుతూ.

"అనేదేముంది? ఇదీ ప్రకృతి పనే. ఇందులో దేవుడి ప్రమేయం వుందని నేను నమ్మను." మళ్ళీ నిరాకరించాడు అధ్యక్షుడు.

వెంటనే ఆకాశవాణి పలికింది.

"మూర్ఖుడా! పూజారి చెప్పినట్లు చేయండి."

వెంటనే పూజారి భక్తితో రెండు చేతులు పైకెత్తి ఆకాశం వైపు చూస్తూ నమస్కరించాడు. తర్వాత అధ్యక్షుడితో ఆనందంగా చెప్పాడు.

"ఇప్పుడైనా వప్పుకుంటారా దేవుడు నా పక్షం వున్నాడని?"

"ఒప్పుకుంటాను. కాని హుండీనే కొంటాము." దృఢంగా చెప్పాడు అధ్యక్షుడు.

"అదేమిటి? దేవుడి మాటనే ఖాతరు చెయ్యరా?"ఆశ్చర్యంగా అడిగాడు పూజారి.

"బోర్డు రూల్స్ బోర్డుకున్నాయి కదా. మొత్తం సభ్యులలో నీది, దేవుడిది కలిసి ఇత్తడి గిన్నె కొనడానికి రెండు ఓట్లే పడ్డాయి. మావి తొమ్మిది కాబట్టి హుండీనే కొనాలి." చెప్పాడు అధ్యక్షుడు.

ఆ అధ్యక్షుడు అవివేకిగానో లేదా సాక్షాత్తు దేవుడి మాటే వినని దుర్మార్గుడిగానో అనిపిస్తున్నాడు కదా? మరి మనం?

మనం కూడా దేవుడు చెప్పినవాటిలో చాలా పాటించకుండా అంత అవివేకంగాను, దుర్మార్గంగానూ ప్రవర్తిస్తున్నాం. ధనం మీద మనకున్న వ్యామోహంతో దేవుడు చెప్పిన చాలావాటిని మనం ఖాతరు చేయడం లేదు. అబద్ధం ఆడద్దన్నాడు. దొంగతనం చెయ్యద్దన్నాడు. లంచం తీసుకోవద్దన్నాడు. పరాయి ఆడవాళ్ళని తల్లిలా చూడమన్నాడు. చెడు మాట్లాడద్దన్నాడు. ఇంకా ఎన్నో సూచించాడు.

వీటిలో మనం ఎన్ని పాటిస్తున్నాం?

## 76. ఘోర పాపం

చైతన్య మహాప్రభువు కృష్ణ భక్తుడు. ఆయన కృష్ణ ప్రభువు మీద భక్తి గీతాలు ఆలపిస్తూ, నృత్యం చేస్తూంటే, అంతా మైమరచి పోయేవారు. తన జీవితకాలంలో ఆయన లెక్కలేనంత మందిని కృష్ణ భక్తిలోకి ప్రవహింపచేసాడు.

ఓ రోజు ఓ తండ్రి చైతన్య మహాప్రభువు దగ్గరకి వచ్చి మొరపెట్టుకున్నాడు.

"స్వామీ. తాచెడ్డ కోతి వనమెల్ల చెరిచిందన్న సామెతలా వుంది మీ తీరు. మా అబ్బాయి కూడా కృష్ణుడి పిచ్చిలో పడ్డాడు. ఇంటిని, పిల్లల్ని నిర్లక్ష్యం చేసి కృష్ణ భక్తి పారవశ్యంలో మునిగి ఉన్నాడు. వాణ్ణి ఎలాగైనా తిరిగి మామూలు మనిషిని చేసి పుణ్యం కట్టుకోండి."

"అంతటి భక్తి అలవడటం ఎంతో కష్టం. ఆ భక్తిని కొనసాగనీయండి." చైతన్యుడు ఆయనకి నచ్చచెప్పే ప్రయత్నం చేసి విఫలుడయ్యాడు. ఇక తప్పదనుకున్నాక చెప్పాడు.

"ఎవరికైనా దైవభక్తి గిట్టకుండా చెయ్యాలంటే ఒకటే దారి. వాడిని దుర్మార్గుడిగా మార్చాలి. దుర్మార్గుడి మనసు ప్రాపంచిక సుఖాలమీద తప్ప దైవం మీద లగ్నం కాదు."

"ఎలా స్వామీ?"

"ఓ పని చెయ్యి. రోజూ శివాలయంలోని ప్రసాదం దొంగిలించి తెచ్చి, దాంతో వాడి కడుపు నింపుతూండు."